క్లుప్తంగా

వైభవంగా వేణుగోపాలస్వామి కల్యాణం


ఆయుష్య హోమం నిర్వహిస్తున్న వేద పండితులు

ఎంవీపీ కాలనీ: ఎంవీపీ కాలనీలోని శ్రీసాయి గోకుల గురుదత్త విహార్‌లో భక్త బృందం ఆధ్వర్యంలో శనివారం శ్రీరుక్మిణీ సత్యభామ సహిత వేణుగోపాలస్వామి కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. శ్రీసాయి గోకుల గురుదత్త విహార్‌లో 18వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఎంవీపీ కాలనీ సెక్టార్–11లో పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఈ నెల 25 తేదీ వరకు ఈ వేడుకలు కొనసాగనున్నట్లు నిర్వాహకులు వెల్లడించారు. ఈ వేడుకల్లో భాగంగా శనివారం ఆయుష్య హోమం, మృత్యుంజయ హవనం, నవగ్రహ సహిత శ్రీసూర్యమంత్ర హవనం పూజలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. సాయంత్రం కార్యక్రమంలో భాగంగా శ్రీచైతన్య బ్రదర్స్ భక్తి సంగీత సుధా లహరి భక్తులకు అలరించింది.

రక్తదానంతో ప్రాణదానం


రక్తదాన శిబిరంలో పాల్గొన్న కోలా గురువులు

బీచ్ రోడ్డు: ధనం కన్న రక్తదానం మిన్న అని, ఇది ఎంతో మంది ప్రాణాలు కాపాడుతుందని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, డీసీసీబీ చైర్మన్ కోలా గురువులు అన్నారు. అఖిల భారత మాజీ సైనిక బ్యాంకు ఉద్యోగుల సమాఖ్య, జనరేషన్ యువ సంయుక్తంగా శనివారం బీచ్‌రోడ్డులోని వైఎంసీఏ భవనం వద్ద రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని ప్రారంభించిన అనంతరం గురువులు మాట్లాడుతూ ఇటువంటి రక్తదాన శిబిరాలు నిర్వహించి రక్తం కొరత లేకుండా చేయడం అభినందనీయమన్నారు. మరిన్ని శిబిరాలను నిర్వహించాలని ఆకాంక్షించారు. ఈ శిబిరం ద్వారా 100 యూనిట్ల రక్తాన్ని సేకరించామన్నారు. ఈ కార్యక్రమంలో సురేష్ కుమార్, ఏవీజీ రాజు, తదితరులు పాల్గొన్నారు.

మార్చి 26 నుంచి సుదర్శన నారసింహ మహాయజ్ఞం

సింహాచలం : సింహగిరిపై మార్చి 26 నుంచి ఏప్రిల్ 1వ తేదీ వరకు చదుర్వేద హవనపూర్వక, పాంచాహ్నిక పంచకుండాత్మక శ్రీ సుదర్శన నారసింహ మహా యజ్ఞాన్ని నిర్వహించనున్నట్టు సింహాచలం దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి శనివారం తెలిపారు. దేశం శస్యశ్యామలంగా ఉండాలని, ప్రజలందరికీ శాంతి సౌభాగ్యాలు లభించాలని కాంక్షిస్తూ మహాయజ్ఞం నిర్వహించనున్నామన్నారు. మార్చి 26న అంకురార్పణతో ప్రారంభమయ్యే మహా యజ్ఞం ఏప్రిల్ 1న జరిగిన మహా పూర్ణాహుతితో ముగుస్తుందని తెలిపారు. దీనిలో భాగంగా ఆదివారం ఉదయం 10.07 గంటలకు సింహగిరిపై ఉత్తర రాజగోపురం ఎదురుగా ఉన్న ఖాళీ ప్రదేశంలో భూమిపూజ నిర్వహిస్తామని తెలిపారు.

27 నుంచి 9 కేంద్రాల్లో టెట్

విశాఖ విద్య: టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్ (టెట్–2024) ఈ నెల 27 నుంచి మార్చి 6 వరకు జరగనున్నట్లు డీఈవో ఎల్.చంద్రకళ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో 37,556 మంది అభ్యర్థులు హాజరవుతున్నట్లు వెల్లడించారు. వీరి కోసం జిల్లాలో 9 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు తప్పనిసరిగా రెండు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు, ఆధార్ కార్డు ఒరిజినల్, జెరాక్స్ ప్రతి, ఏదైనా గుర్తింపు కార్డు వెంట తీసుకొని రావాలన్నారు. మొదటి సెషన్ ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, రెండో సెషన్ మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఉంటుందన్నారు. పరీక్ష సమయానికి అరగంట ముందు అభ్యర్థులు కేంద్రాలకు రావాలన్నారు. డీఈవో కార్యాలయంలో టెట్ సెల్ ఏర్పాటు చేశామన్నారు. ఇతర సమాచారం కోసం 9849245230, 6305538679 నంబర్లలో సంప్రదించాలన్నారు.

చకచకా వంతెన పనులు


పెదగదిలి వద్ద జరుగుతున్న బ్రిడ్జి పనులు

ఆరిలోవ: బీఆర్‌టీఎస్ రోడ్డును ఆనుకుని పెదగదిలి వద్ద గెడ్డపై తలపెట్టిన వంతెన పనులు చకచకగా జరుగుతున్నాయి. జీవీఎంసీ 12వ వార్డులో బీఆర్‌టీఎస్ రోడ్డును ఆనుకుని పెదగదిలి నుంచి తోటగరువు వెళ్లే మార్గం మధ్యలో పెద్ద గెడ్డపై ఇరుకు బ్రిడ్జి ఉండేది. దీనిని ఇటీవల జీవీఎంసీ అధికారులు తొలగించారు. ఆ స్థానంలో ఇక్కడ కొత్తగా విశాలమైన వంతెన నిర్మాణం కోసం జీవీఎంసీ రూ.3.76 కోట్ల నిధులు కేటాయించింది. ఈ నిధులతో సంబంధిత అధికారులు పనులు శరవేగంగా జరిపిస్తున్నారు. ఇందులో భాగంగా గెడ్డలో నీరు కిందకు పోవడానికి వీలుగా బ్రిడ్జి పక్క నుంచి రోడ్డును తవ్వించి ప్రత్యామ్నాయం మార్గం ఏర్పాటు చేశారు. తోటగరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న పెదగదిలి, చినగదిలి, సింహగిరి కాలనీ, సంజయ్‌గాంధీ కాలనీ తదితర కొండవాలు ప్రాంతాల నుంచి విద్యార్థులు, నగరం నుంచి వచ్చే ఉపాధ్యాయులు, పెదగదిలి వెళ్లాల్సిన తోటగరువు వాసులు సౌలభ్యం కోసం అధికారులు ప్రత్యామ్నాయంగా మట్టి రహదారిని కూడా ఏర్పాటు చేశారు. ఈ రోడ్డుపై విద్యార్థులు పాఠశాలకు సైకిళ్లపై వెళ్లగలుగుతున్నారు. ఆటోలు, ద్విచక్ర వాహనచోదకులు మాత్రం ఇక్కడ కొంత ఇబ్బంది పడాల్సి వస్తోంది.

జీవీఎంసీ స్థలాలను పరిరక్షించాలి

- అధికారులకు కమిషనర్ ఆదేశం
- ముడసర్లోవ, ఆరిలోవ ప్రాంతాల్లో పర్యటన


ముడసర్లోవ నర్సరీలో మొక్కలు పరిశీలిస్తున్న జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ


ఆరిలోవ ఆఖరి బస్టాప్ వద్ద ఖాళీ స్థలాలను పరిశీలిస్తున్న కమిషనర్ సాయికాంత్‌వర్మ

ఆరిలోవ: నగరంలో జీవీఎంసీకి చెందిన ఖాళీ స్థలాలను గుర్తించి వాటిని పరిరక్షించాలని జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్‌వర్మ అధికారులను ఆదేశించారు. జోన్–2 పరిధి ముడసర్లోవ, ఆరిలోవ ప్రాంతాలలో ఆయన జీవీఎంసీ అధికారులుతో కలిసి శనివారం పర్యటించారు. ముడసర్లోవ సమీపంలోని జీవీఎంసీ నర్సరీని సందర్శించారు. ఏయే మొక్కలు పెంచుతున్నారు? ఎంత విస్తీర్ణంలో నిర్వహిస్తున్నారు? తదితరు వివరాలను జీవీఎంసీ హార్టీకల్చర్ డిప్యూటీ డైరెక్టర్ ఎం.దామోదరరావును అడిగి తెలుసుకున్నారు. ఈ నర్సరీ స్థలంలో ఆకర్షణీయమైన చిల్డ్రన్ పార్కు ఏర్పాటు చేయాలనే ఆలోచనలో ఉన్నట్లు తెలిపారు. ఇక్కడ ఉన్న నర్సరీని వేరేచోటకు తరలించడానికి అనువైన స్థలం చూడాలని దామోదరరావుకు సూచించారు. ముడసర్లోవ పరిసర ప్రాంతాలలో ఉన్న జీవీఎంసీకి చెందిన ఖాళీ స్థలాలను పరిశీలించి వాటిని సర్వే చేయించి నివేదిక సిద్ధం చేసి తనకు అందజేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం ఆరిలోవ ఆఖరి బస్ స్టాప్, శివాజీనగర్ ప్రాంతాలలో రోడ్డు పక్కన చెత్త అస్తవ్యస్తంగా ఉండడంతో శానిటరీ ఇన్‌స్పెక్టర్, సిబ్బందిపై కమిషనర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయా ప్రాంతాలను వెంటనే పరిశుభ్రం చేయాలని ఆదేశించారు. ఈ పర్యటనలో కమిషనర్‌తో పాటు జోన్–2 జెడ్సీ జి.శైలజవల్లి, ఏఎంవో డాక్టర్ కిశోర్, పర్యవేక్షక ఇంజనీర్ శాంసన్‌రాజు, కార్యనిర్వాహక ఇంజనీర్ శాంతిరాజు పాల్గొన్నారు.

ఆరు గంటల్లో చోరీ నిందితుడు అరెస్ట్

- మరో నిందితుడి కోసం గాలింపు
- మూడో పట్టణ పోలీసు స్టేషన్ పరిధిలో చైన్ స్నాచింగ్ కేసు

బీచ్ రోడ్డు: నడక పూర్తి చేసుకుని ఇంటికి తిరిగి వస్తున్న ఓ మహిళ మెడలో మూడు తులాల బంగారాన్ని దుండగలు తెంచుకుపోయారు. మూడో పట్టణ పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. విశ్రాంత హెడ్ఎం పి.కరుణమ్మ సీబీఎం కాంపౌండ్ ప్రాంతంలో నివాసం ఉంటున్నారు. శనివారం ఉదయం 8 గంటలకు వాకింగ్ పూర్తి చేసుకుని తన భర్తతో తిరిగి ఇంటికి వస్తున్న ఆమె మెడలో ఉన్న మూడు తులాల బంగారు గొలుసును ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు బైకు మీద వచ్చి చోరీ చేశారు. తేరుకున్న బాధితులు వెంటనే మూడో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. వెంటనే పోలీసులు రంగంలోకి దిగి కేవలం 6 గంటల వ్యవధిలోనే ఓ నిందితుడిని పట్టుకున్నారు. నిందితులు బైకు మీద వచ్చినట్టు సీసీటీవీ ఫుటేజీ ఆధారంగా పోలీసులు గుర్తించారు. వారు పలాస వైపు వెళ్తున్నట్లు నిర్ధారించుకున్నారు. దీంతో వారిని అనుసరిస్తూ వెళ్లిన పోలీసులు మధ్యాహ్నం 2 గంటలకు ఇద్దరి నిందితుడిలో ఒకరిని అదుపులోకి తీసుకున్నారు. మరో నిందితుడి కోసం గాలింపు చేపట్టారు. బంగారం పరారైన నిందితుడి వద్ద ఉన్నట్లు సమాచారం. పట్టుకున్న నిందితుడిని పూర్తి వివరాల కోసం విచారిస్తున్నట్లు తెలిసింది.

సహకార రంగంలో రాఘవేంద్రరావు సేవలు ప్రశంసనీయం


రాఘవేంద్రరావును సత్కరిస్తున్న ప్రముఖులు

డాబాగార్డెన్స్: నాఫ్ కాబ్ డైరెక్టర్‌గా విశాఖపట్నం కో ఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ చలసాని రాఘవేంద్రరావు ఎన్నిక కావడంతో విశాఖ కో ఆపరేటివ్ బ్యాంక్ ప్రతిష్ట మరింత పెరిగిందని పలువురు వ్యక్తులు పేర్కొన్నారు. శనివారం వీఎంఆర్‌డీఏ చిల్డ్రన్స్ ఎరీనాలో అభినందన సభను బ్యాంక్ డైరెక్టర్ చంద్రశేఖర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ రాఘవేంద్రరావు సారథ్యంలో బ్యాంకులో పలు నూతన సాంకేతిక సేవలు ప్రవేశపెట్టి సభ్యులు, ఖాతాదారులకు అందుబాటులోకి తీసుకువచ్చారని చెప్పారు. సహకార స్ఫూర్తితో బ్యాంకును పురోభివృద్ధి దిశలో నడిపిస్తున్న చలసాని 20 ఏళ్లగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని సహకార అర్బన్ బ్యాంకులు, క్రెడిట్ సొసైటీలు బలోపేతానికి కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. అనేక సందర్భాల్లో ఆర్‌బీఐ ఉన్నతాధికారుల దృష్టికి, రాష్ట్ర సహకార శాఖ అధికారుల దృష్టికి అర్బన్ బ్యాంకుల సమస్యలు తీసుకెళ్లిన చలసాని నాఫ్ కాబ్ డైరెక్టర్‌గా ఎన్నిక కావడం సహకార అర్బన్ బ్యాంకింగ్ వ్యవస్థ బలోపేతానికి దోహదపడుతుందన్నారు. చలసాని రాఘవేంద్రరావు మాట్లాడుతూ తనకు జరిగిన సత్కారం అర్బన్ బ్యాంకులు, క్రెడిట్ సొసైటీల జాతీయ సమాఖ్యకు చెందుతుందన్నారు. సహకార వ్యవస్థ చాలా సంక్లిష్ట పరిస్థితుల్లో ఉన్నాయని, సహకార వ్యవస్థ మనుగడకు అందరం కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బ్యాంక్ గౌరవ విశ్రాంత చైర్మన్ మానం ఆంజనేయులు, డైరెక్టర్లు గుడివాడ భాస్కరరావు, సూర్యనేని నాగభూషణ చౌదరీ, అప్పారి జోసెఫ్ స్టాలిన్, నామన కామరాజు, కాకి భవాని, గుళ్లపల్లి జనార్దనరావు, చెరువు ఆదినారాయణ, శిరివూరి జానకి రామచంద్రరాజు, కండాపు ప్రసాదరావు, ఉప్పలపాటి పార్వతీదేవి, జేవీ సత్యనారాయణమూర్తి, దండమూరి బాబూరావు, ఎ.రామకృష్ణారావు, కృష్ణమోహన్, బ్యాంక్ సీఈవో పీవీ నరసింహమూర్తి, డిప్యూటీ సీఈవో వరలక్ష్మి, జనరల్ మేనేజర్ ఏవీ రామకృష్ణారావు పాల్గొన్నారు.

ఏయూతో పనిచేయడానికి జపాన్ సంస్థ ఆసక్తి


కిరణ్ కుమార్‌ను సత్కరిస్తున్న వీసీ ప్రసాద రెడ్డి

ఏయూక్యాంపస్: ఆంధ్రవిశ్వవిద్యాలయంతో పనిచేయడానికి జపాన్‌కు చెందిన ఏమని ఎంజైమ్ ఇంక్ ఇన్నోవేషన్ సెంటర్ గిఫు జపాన్ ఆసక్తి వ్యక్తం చేసింది. జపాన్ సంస్థ సీనియర్ శాస్త్రవేత్త ఏయూ పూర్వ విద్యార్థి డాక్టర్ జి.కిరణ్ కుమార్ శనివారం ఏయూను సందర్శించారు. ఈ సందర్భంగా ఏయూ వీసీ ఆచార్య పీవీజీడీ ప్రసాద రెడ్డితో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. ఏయూలో ఫుడ్ టెక్నాలజీ, బయోటెక్నాలజీ, హెల్త్ కేర్ రంగాలలో జరుగుతున్న పరిశోధనలను వివరించారు. ఏయూతో విభిన్న అంశాలలో కలసి పనిచేయాలని, పరిశోధన రంగంలో విదేశాలతో పనిచేయడానికి ఏయూ సిద్ధంగా ఉందని వీసీ ప్రసాద రెడ్డి స్పష్టం చేశారు. అదే విధంగా ఏయూ పూర్వ విద్యార్థులు విదేశాలలో ఉన్నత స్థానాలలో స్థిరపడటంపై హర్షం వ్యక్తం చేశారు. డాక్టర్ కిరణ్ కుమార్‌ను జపాన్ సంస్థ భారత్‌తో వ్యూహాత్మక భాగస్వామ్యంలో భాగంగా పరిశోధన రంగంలో విద్యాసంస్థలతో సంయుక్తంగా పనిచేసే దిశగా భారత్‌కు పంపింది. నీతి ఆయోగ్ విశాఖకు ఎకనామిక్ గ్రోత్ ఇంజన్‌గా గుర్తించింది. ఈ నేపథ్యంలో విశాఖలోని వివిధ రంగాలను పరిశీలించడానికి కిరణ్‌కుమార్ ఏయూకు విచ్చేశారు. అనంతరం ఏయూలోని జపాన్ అధ్యయన కేంద్రాన్ని కిరణ్ కుమార్ సందర్శించారు. ఏయూలో జపాన్ భాషను నేర్పించే దిశగా అందిస్తున్న వివిధ కోర్సులు వివరాలు డాక్టర్ మూర్తి తెలయజేశారు. కార్యక్రమంలో ఏయూ ఐపీఆర్ చైర్ ప్రొఫెసర్ డాక్టర్ హనుమంతు పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

చేనేత వస్త్రాలకు చిరునామా ఆంధ్ర ప్రదేశ్

ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు


శిల్పారామంలో చేనేత వస్త్ర మేళాను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

పీఎం పాలెం: చేనేత ఉత్పత్తులకు చిరునామా ఆంధ్రప్రదేశ్ అని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు పేర్కొన్నారు. భారత ప్రభుత్వ అభివృద్ధి కమిషనర్, చేనేత, న్యూఢిల్లీ సౌజన్యంతో ఆంధ్ర ప్రదేశ్ శిల్పారామం సొసైటీ ఏర్పాటు చేసిన చేనేత వస్త్రాల ప్రదర్శన విక్రయ స్టాల్స్‌ను ఆయన స్థానిక శిల్పారామంలో శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆధునిక సాంకేతిక యుగంలో వస్త్రాల తయారీలో ఎన్ని విప్లవాత్మక మార్పులు వచ్చినప్పటికీ మన చేనేత కళాకారులు తయారు చేసిన వస్త్ర ఉత్పత్తులకు పోటీకాదన్నారు. రానున్న వేసవిలో ధరించడానికి చేనేత వస్త్రాలు ఎంతో సౌకర్యంగా ఉంటాయన్నారు. మార్చి 8వ తేదీ వరకూ కొనసాగనున్న చేనేత మేళాలో వస్త్రాలు కోనుగోలు చేసి చేనేత కళాకారులను ప్రోత్సహించాలని ఆయన కోరారు. స్థానిక పరిపాలన అధికారి విశ్వనాథరెడ్డి , రాష్ట్ర నగరాల కార్పొరేషన్ అధ్యక్షుడు పోతిన శ్రీనివాసరావు, 6వ వార్డు వైఎస్సార్ సీపీ నాయకులు బొట్ట అప్పలరాజు, కె.వరలక్ష్మి, గాయత్రీ నగర్ అప్పారావు పాల్గొన్నారు.

27న వైద్య ఆరోగ్యశాఖ ఉద్యోగుల గ్రీవెన్స్

మహారాణిపేట: ఉత్తరాంధ్ర జిల్లాల్లోని వైద్య ఆరోగ్యశాఖ ఉద్యోగుల కోసం ఈ నెల 27న గ్రీవెన్స్ నిర్వహిస్తున్నట్లు ఆ శాఖ ప్రాంతీయ సంచాలకురాలు డాక్టర్ బి.సుజాత తెలిపారు. శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, అల్లూరు సీతారామరాజు జిల్లా, అనకాపల్లి, విశాఖ జిల్లాల్లోని వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది జీత భత్యాలకు సంబంధించిన సమస్యలను పరిష్కరించాలని హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ కమిషనర్ ఆదేశాలు జారీ చేశారన్నారు. ఈ మేరకు ఆ రోజు ఫిర్యాదులు స్వీకరించి పరిష్కరిస్తామని ప్రాంతీయ సంచాలకురాలు వెల్లడించారు.

కారు ఢీకొని పాదచారుడి మృతి


మృతి చెందిన గుర్తు తెలియని పాదచారుడు

గోపాలపట్నం: రోడ్డు దాటుతున్న వ్యక్తిని కారు ఢీకొట్టడంతో మృతి చెందిన ఘటన మర్రిపాలెం వద్ద చోటు చేసుకుంది. కంచరపాలెం ట్రాఫిక్ పోలీసులు తెలిపిన వివరాలు.. శనివారం సాయంత్రం మర్రిపాలెం సెలబ్రిటీ హోటల్ సమీపంలో రోడ్డు దాటుతుండగా ఎన్ఏడీ నుంచి మర్రిపాలెం వైపు వెళ్తున్న కారు వేగంగా వచ్చి బీఆర్‌టీఎస్ రోడ్డులో పాదచారుడిని ఢీకొట్టింది. దీంతో తీవ్ర గాయాలైన గుర్తు తెలియని వ్యక్తిని కేజీహెచ్‌కు తరలించారు. అక్కడి చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుని వివరాలు ఇంకా తెలియరాలేదు. ట్రాఫిక్ సీఐ ప్రసాదరావు ఆధ్వర్యంలో ఎస్ఐ బాలరాజు దర్యాప్తు చేపట్టారు.

ఏయూ సమాచారం..

మార్చి 27, 28 తేదీల్లో జాతీయ సదస్సు


పోస్టర్ ఆవిష్కరిస్తున్న వీసీ ప్రసాదరెడ్డి, తదితరులు

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం తత్వశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో మార్చి 27, 28 తేదీలలో ధార్మిక ఆలోచనల ఆవిర్భావం–ప్రాచీన సంప్రదాయాలపై ఆధునిక దృక్పథం అంశంపై జరిగే జాతీయ సదస్సు పోస్టర్‌ను ఆంధ్ర విశ్వవిద్యాలయం వీసీ ఆచార్య ప్రసాద్‌రెడ్డి విడుదల చేశారు. శనివారం ఉదయం ఏయూ వీసీ కార్యాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్, తత్వశాస్త్ర విభాగాధిపతి ఆచార్య వానపల్లి వెంకట్రావు, బీవోఎస్ చైర్మన్ డాక్టర్ బి.వెంకటస్వామి, సీనియర్ ఆచార్యులు ఎం.వి కృష్ణయ్య, డాక్టర్ విన్సెంట్ రవి, తదితరులు పాల్గొన్నారు.

నూతన జ్ఞానాన్ని పెంపొందించుకోవాలి


అధ్యాపకులకు సర్టిఫికెట్లు ప్రదానం చేస్తున్న రిజిస్ట్రార్ ఎం.జేమ్స్ స్టీఫెన్

ఏయూ క్యాంపస్: అధ్యాపకులు నిరంతరం నూతన జ్ఞానాన్ని అందిపుచ్చుకునే ప్రయత్నం చేయాలని ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్‌స్టీఫెన్ అన్నారు. ఏయూలోని యూజీసీ మాలవీయ మిషన్ టీచర్ ట్రైనింగ్ సెంటర్‌లో విపత్తు నిర్వహణపై నిర్వహిస్తున్న శిక్షణ తరగతులు ముగింపు కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా మాట్లాడా రు. విభిన్న రంగాల నిపుణులతో అందించే ఇటు వంటి శిక్షణ కార్యక్రమాలు అధ్యాపకుల నైపుణ్యా లు, సామర్థ్యాలను మరింత పెంపొందిస్తాయన్నా రు. ఏయూలోని ఎంఎంటీటీసీ కేంద్రం ఇటువంటి శిక్షణ తరగతుల నిర్వహణలో జాతీయ స్థాయిలో గుర్తింపును సాధించిందన్నారు. ఇక్కడ నేర్చుకున్న నూతన జ్ఞానాన్ని అధ్యాపకులు విద్యార్థులకు చేరువ చేయాలని సూచించారు. కేంద్రం సంచాలకుడు ఆచార్య టి.వి.కృష్ణ మాట్లాడుతూ ఏపీ, తెలంగాణ రాష్ట్రాల నుంచి వివిధ డిగ్రీ కళాశాలల అధ్యాపకులకు రెండు వారాల శిక్షణ తరగతులు నిర్వహించామన్నారు. కోర్సు సమన్వయకర్త ఆచార్య సి.వి.నాయుడు మాట్లాడుతూ గ్లోబల్ వార్మింగ్ తదితర అంశాలపై అవగాహన కల్పించామన్నారు. అనంతరం శిక్షణ పూర్తి చేసుకున్న అధ్యాపకులకు సర్టిఫికెట్లను ప్రదానం చేశారు.

నేడు ఛత్రపతి శివాజీ నాటకం ప్రదర్శన


వివరాలు తెలియజేస్తున్న సంస్కార భారతి జిల్లా అధ్యక్షురాలు శర్వాణి

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం కేవీ గోపాలస్వామి ఆరుబయలు రంగస్థలం వేదికగా ఆదివారం సాయంత్రం 6 గంటలకు ఛత్రపతి శివాజీ మహారాజ్ నాటకం ప్రదర్శించనున్నట్లు సంస్కార భారతి విశాఖపట్నం అధ్యక్షురాలు దూర్వాసుల శర్వాణి తెలిపారు. శివాజీ మహారాజ్ పట్టాభిషేకం జరిగి 350 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఆ మహనీయుని జీవితంలో పలు ప్రేరణాత్మకమైన ఘట్టాలను, విజయాలను, దౌత్య విధానాలను వివరించేలా ఈ నాటకం ప్రదర్శన ఉంటుందన్నారు. డాక్టర్ రామన్ ఫౌండేషన్ వారి శ్రీసాయి బాబా నాట్య మండలి కళాకారులు 60 మంది ఆధునిక సాంకేతికత, భారీ సెట్టింగులతో ఈ నాటకాన్ని ప్రదర్శించనున్నారని పేర్కొన్నారు.

నేత్రపర్వంగా లలితాదేవి నగరోత్సవం


ప్రత్యేక అలంకరణలో లలితాదేవి పల్లకీ ఊరేగింపు


గుర్రపు రథంపై ఊరేగుతున్న సిద్ధేశ్వరానంద భారతీ మహాస్వామి


నగరోత్సవంలో పాల్గొన్న భక్తులు

సీతంపేట: లలితా పీఠం 75వ వార్షికోత్సవాల్లో భాగంగా ఐదు రోజుల పాటు నిర్వహించిన అమ్మతోత్సవాల ముగింపు సందర్భంగా శనివారం లలితాదేవిని ప్రత్యేకంగా అలంరించిన పల్లకీపై ఊరేగించారు. మేళతాళాలు, కోలాటం, తప్పిట గుళ్లు, భక్తుల జయజయ ధ్వానాల మధ్య నగర వీధుల్లో ఊరేగింపు కనుల పండువగా సాగింది. అక్కయ్యపాలెం లలితానగర్‌లోని లలితా పీఠం వద్ద ప్రారంభమైన నగరోత్సవం శంకరమఠం రోడ్, అక్కయ్యపాలెం మెయిన్ రోడ్ మీదుగా తిరిగి పీఠానికి చేరుకుంది. ఈ ఉత్సవంలో గుర్రపు రథంపై పీఠాధిపతి సిద్ధేశ్వరానంద భారతీ మహాస్వామి, ఓపెన్ కారుపై శక్తి పీఠాధీశ్వరి మాతా రమ్యానంద భారతీ స్వామిని పాల్గొన్నారు. అడుగడుగునా హారతులు, టెంకాయలతో లలితా అమ్మవారికి, స్వామీజీకి భక్తులు నీరాజనాలు పలికారు. ఉదయం పీఠంలో స్వామీజీ చేతుల మీదుగా కుంభాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో కుర్తాళం పురోహితుడు మాచవోలు రమేష్‌శర్మ, లలితా పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్, నిర్వాహక కార్యదర్శి వెంపరాల నరసింహమూర్తి, ఉత్సవ కమిటీ అధ్యక్షుడు పి.ఎల్.ఎస్.శర్మ, కమిటీ సభ్యులు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షల నిర్వహణపై సమావేశం


మాట్లాడుతున్న ఆర్ఐవో మురళీధర్

సీతంపేట: డాక్టర్ లంకపల్లి బుల్లయ్య కళాశాలలో ఇంటర్మీడియట్ బోర్డు ఆర్ఐవో పి.మురళీధర్ ఆధ్వర్యంలో శనివారం ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వహణపై సమావేశం నిర్వహించారు. విశాఖ జిల్లాకు సంబంధించి 93 ఎగ్జామినేషన్ సెంటర్స్ సీఎస్ డిపార్ట్‌మెంట్ ఆఫీసర్స్, కస్టోడియన్స్, ఫ్లయింగ్ స్క్వాడ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా మురళీధర్ మాట్లాడుతూ మార్చి 1 నుంచి ప్రారంభమవనున్న ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల నిర్వహణపై పలు సూచనలిచ్చారు. కార్యక్రమంలో ఇంటర్ పరీక్షల ప్రత్యేక అధికారి బి.రాధ, జిల్లా పరీక్షల నిర్వహణ కమిటీ సభ్యులు, ఆర్ఐవో కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సెమీస్‌కు ముంబయి, చెన్నై

- ఉత్కంఠగా మేజర్ పోర్ట్స్ కబడ్డీ చాంపియన్‌షిప్

విశాఖ స్పోర్ట్స్: ఆల్ ఇండియా మేజర్ పోర్ట్స్ కబడ్డీ చాంపియన్‌షిప్‌లో ఏ పూల్‌లో ముంబయి పోర్టు, బీ పూల్‌లో చెన్నై పోర్టు జట్లు ఆధిక్యాన్ని ప్రదర్శించి సెమీస్‌కు చేరుకున్నాయి. సెమీస్‌లో ముంబయితో ట్యుటికోరిన్ పోర్టు జట్టు, చెన్నైతో జేఎన్‌పీ జట్టు తలపడనున్నాయి. పోర్టు స్టేడియంలో జరుగుతున్న పోటీల్లో శనివారం ఉదయం ట్యుటికోరిన్ జట్టు 61–39 పాయింట్లతో పారాదీప్ పోర్టు జట్టుపై విజయం సాధించింది. తొలి అర్ధ భాగంలో కేవలం (28–21) ఏడు పాయింట్లే ఆధిక్యం సాధించిన ట్యుటికోరిన్ జట్టు.. తర్వాత పుంజుకుని విజయం సాధించింది. భరత్ 26, వేలన్ 14 పాయింట్లు సాధించారు. మరో మ్యాచ్‌లో జేఎన్‌పీ జట్టు 31–19తో ఎన్ఎంపీ జట్టుపై విజయం సాధించింది. తొలి అర్ధభాగంలో రెట్టింపు(18–9)పాయింట్లతో జేఎన్‌పీ ఆధిక్యంలోకి దూసుకెళ్లగా.. పార్థీ 15, ప్రమోద్ 10 పాయింట్లతో విజయాన్ని ఖరారు చేశారు. సాయంత్రం జరిగిన తొలి మ్యాచ్‌లో ముంబయి పోర్టు జట్టు 36–16తో న్యూమంగళూర్ పోర్టు జట్టుపై విజయం సాధించింది. తొలి అర్ధభాగంలో 18–7లో ఆధిక్యంలోకి దూసుకెళ్లిన ముంబయి తరఫున సౌరభ్‌రౌత్ 15, సౌరభ్ పార్తే 10 పాయింట్లు సాధించారు. మరో మ్యాచ్‌లో చెన్నై పోర్టు జట్టు 64–32తో పారాదీప్ పోర్టుపై విజయం సాధించింది. చెన్నై పోర్టు తరఫున దినేష్ 12, హరికృష్ణ 11, స్టువర్ట్ 6 పాయింట్లు సాధించారు. స్పోర్ట్స్ కోటాలో పోర్టులో ఉద్యోగం సాధించిన వెటరన్ ఆటగాళ్లను ఈ సందర్భంగా నిర్వాహక కమిటీ సత్కరించింది.